క్లుప్తంగా

భూకైలాస్‌లో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



హోమం చేస్తున్న భక్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలో అంతారం తండాలోని భూకైలాస్ ద్వాదశ జ్యోతిర్లింగ దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలిండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు శంకర్‌నాయక్ పవార్, భూకై లాస్ ఆలయ వ్యవస్థాపకుడు వాసుపవార్ నాయక్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వస్తి పుణ్యహవాచనం, అంకురార్పణ , లక్ష్మీగణపతి హోమం, మండపారాధన, యాగశాల ప్రవేశం వంటి పూజలు నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా ఉపవాసం చేస్తున్న భక్తులు భూకైలాస్‌కు చేరుకొని స్వామివారికి నైవేద్యం సమర్పించి ఉపవాస దీక్ష విరమిస్తారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి



వినతి పత్రం ఇస్తున్న మైనార్టీ నాయకులు

కొడంగల్: రంజాన్ మాసం సందర్భంగా మున్సిపల్ పరిధిలోని మసీదుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మాజీ ఉప సర్పంచు ఎస్ఎమ్ గౌసన్ మంగళవారం మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రార్థన సమయాల్లో విద్యుత్, నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని కోరారు. మసీదుల వద్ద పారిశుద్ధ్య పనులు చేయించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. నమాజుకు వెళ్లే సమయాల్లో ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ తాలూకా కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న సోమశేఖర్

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గం అంబేడ్కర్ తాలూకా కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్, చందు, ప్రధాన కార్యదర్శిగా బాలు, కార్యదర్శిగా రాములు, కోశాధికారిగా సురేష్‌బాబు, సభ్యులుగా భీములు, వెంకట్ కృష్ణ, శివ, మహేష్, శ్రీను, మల్కప్ప, అంజిలప్ప, రాజు, సలహాదారులుగా సోమశేఖర్, దస్తప్ప, దాము, సుభాష్, సాయిలు, అశోక్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సలహాదారుడు సోమశేఖర్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఘనంగా కల్యాణోత్సవం



కల్యాణంలో డాక్టర్ ముద్ద దీపా భక్తవత్సలం దంపతులు

అనంతగిరి: శివరాత్రిని పురస్కరించుకుని వికారాబాద్ పట్టణంలోని మల్లికార్జున భవనంలో మంగళవారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవాన్ని డాక్టర్ ముద్ద దీపాభక్తవత్సలం దంపతులు జరిపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

అనంతగిరి: వికారాబాద్‌లోని గౌతమి జూనియర్ కళాశాల వీడ్కోలు సమావేశం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులై ఉన్నతస్థాయిలో స్థిరపడాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన ముక్కంటి ఆలయాలు

- జీవన్గీలో నాలుగు రోజుల పాటు కొనసాగనున్న వేడుకలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ
- ఆకట్టుకోనున్న అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు
- హాజరుకానున్న భక్తులు



విద్యుత్ కాంతుల్లో మహాదేవ లింగేశ్వరాలయం

బషీరాబాద్: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలను బుధవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు ఉపవాస దీక్షలతో అత్యంత భక్తిశ్రద్ధలతో ముక్కంటి సేవలో తరించనున్నారు. జిల్లాలో శివరాత్రి ఉత్సవాలకు పేరుగాంచిన జీవన్గీ మహాదేవ లింగేశ్వరస్వామి 39వ జాతర ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. కాగ్నా నది ఒడ్డున కొలువు దీరిన మహాదేవుడి ఉత్సవాలకు తొలి రోజు అంకురార్పణ జరిగింది. నాలుగు రోజుల పాటు కొనసాగే ఈ వేడుకలకు జిల్లా ప్రజలతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక నుంచి కూడా వేలల్లో భక్తులు రానున్నారు. అందుకు తగిన అన్నీ ఏర్పాట్లను ఆలయ కమిటీ పూర్తి చేసింది. అలాగే నీళ్లపల్లి రామలింగేశ్వర ఆలయం, నావంద్గీ సంగమేశ్వర ఆలయాల్లో జాతర ఉత్సవాలు జరుగుతాయి. నావంద్గీలో తొలిసారిగా రథోత్సవం నిర్వహించనున్నారు.

ఉత్సవాలు ఇవీ..

నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్వస్తి పుణ్యావాచనం, ధ్వజరోహణ నాంది సమారాధన, అంకురార్పణ, నవగ్రహపూజ, నవగ్రహహోమం, మంటప దేవతపూజ, వెండి పల్లకీ సేవ, రాత్రి 8గంటలకు గ్రామంనుంచి దేవాలయానికి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తారు. బుధవారం మహా శివరాత్రి సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, లింగోద్భవ సమయం వరకు శివపురాణ కథాకాలక్షేపము, తెల్లవారు జామున 5 గంటలకు శివాచార్యులచే అగ్నిగుండ మహోత్సవము నిర్వహిస్తారు.

గురువారం మధ్యాహ్నం 3.15 గంటలకు శివపార్వతుల కల్యాణం, అనంతరం స్వామి వారి రథోత్సవం ఉంటుంది. చివరి రోజు శుక్రవారం మహాదేవ లింగేశ్వరస్వామి వారి కలశం వేలం, కుస్తీ పోటీలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నారని ఆలయ కమిటీ తెలిపింది.

అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు..

జీవన్గీ గ్రామంలో నిర్వహించే జాతర మహోత్సవాలకు తెలంగాణతో పాటు కర్ణాటక సరిహద్దు గ్రామాల నుంచి భక్తులు, ఔత్సాహికులు భారీగా తరలి వస్తారు. ఈ నెల 28న నిర్వహించే అంతర్రాష్ట్ర కుస్తీపట్ల పోటీలలో 200 మందికి పైగా కుస్తీ వీరులు పాల్గొననున్నారు. కాగ్నానది ఇసుక దిబ్బలపై నిర్వహించే ఈ పోటీలను తిలకించేందుకు మండల ప్రజలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా తరలి వస్తారు. గెలుపొందిన వీరులకు ఆలయ కమిటీ నగదు బహుమతులతో సత్కారం చేయనుంది. అయితే ఈ పోటీలను తిలకించేందుకు మహిళలకు అనుమతించరు.



ఆలయంలో వెలసిన శివలింగం



నావంద్గీ సంగమేశ్వర ఆలయం



నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరాలయం

ప్రతి కూలీకి ఉపాధి కల్పిస్తాం



ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

- డీఆర్‌డీఏ శ్రీనివాస్
- ఏప్రిల్ నుంచి జాబ్‌కార్డు ఉన్న వారికి పనులు
- నర్సరీలపై అసంతృప్తి

తాండూరు రూరల్: వేసవి కాలం దృష్ట్యా ఏప్రిల్ నుంచి జాబ్ కార్డు ఉన్న ప్రతీ కూలీకి ఉపాధి కల్పిస్తామని డీఆర్‌డీఏ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం తాండూరు ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పెద్దేముల్, తాండూరు, యాలాల మండలాల ఏపీఓ, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వికారాబాద్ జిల్లాలో 1,86,197 జాబ్ కార్డుల్లో 2,43,886 కూలీలు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు 59,71,480 పని దినాలు పూర్తయినట్లు చెప్పారు. అలాగే 3,756 కుటుంబాలు వంద రోజులు పూర్తి చేశారన్నారు. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఉపాధి కూలీలకు డబ్బులు రూ.142 కోట్లు చెల్లించామన్నారు. ఒక్కోరోజు కూలీకి సగటున రూ.238 చెల్లిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రతీ రోజు 16వేల మంది కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తున్నారన్నారు.

చెరువుల పూడికతీత పనులు లేవు....

ఈ సారి ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లోని చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టడం లేదని డీఆర్‌డీఏ శ్రీనివాస్ తెలిపారు. ఏప్రిల్ నుంచి జిల్లాలో ప్రతీరోజు లక్ష మంది వరకు ఉపాధిహామీ పనుల్లో పాల్గొంటారన్నారు. ఈ సారి ఉపాధి హామీ పనుల్లో ముఖ్యంగా సాగు భూముల్లో ల్యాండ్ లెవలింగ్, కందకాలు తవ్వడం, పొలాలకు వెళ్లే రహదారుల నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. పశువులు, మేకాలు, గొర్రెలు, కోళ్ల షెడ్ల ఏర్పాటులో కూలీలను ఉపయోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న నర్సరీలపై డీఆర్‌డీఏ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకటి, రెండు మండలాలు తప్పా మిగత మండలాల్లో నర్సరీలు అధ్వానంగా ఉన్నాయని మండిపడ్డారు. వచ్చే యేడాది నర్సరీల్లో కనీసం 10వేల నుంచి 15వేల వరకు 23 రకాల మొక్కలు పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సరళకుమారి, జిల్లా ఈసీ సైదులు, ప్లాంటేషన్ ఏపీఓ వెంకటేశం, ఎంపీడీఓ విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ముందే ప్రత్యేక దుకాణాలు

కొనుగోలు దారులతో సందడి



ధారూరులో ఏర్పాటు చేసిన పండ్ల దుకాణాలు

ధారూరు: శివరాత్రి పండుగ సందర్భంగా ధారూరు మండల కేంద్రంలో వివిధ రకాల పండ్ల దుకాణాలు వెలిశాయి. దీంతో కొనుగోలు దారులతో సందడి మొదలైంది. ముఖ్యంగా ధారూరు బస్టాండు సమీపంలో ప్రత్యేకంగా పండ్ల దుకాణాలను ఏర్పాటు చేసి విక్రయాలను సాగిస్తున్నారు. శివరాత్రి రోజు ఉపవాస దీక్షాలో ఉన్నవారు పండ్లు తింటారు. సాయంత్రం పండ్లను స్వీకరించి ఉపవాసం విరమించడం సంప్రదాయంగా వస్తుంది. దీంతో వ్యాపారులు పండ్ల దుకాణాలను ముందుగానే ఏర్పాటు చేశారు. దుకాణాల్లో అరటి, యాపిల్, మోసంబీ, ద్రాక్ష, పుచ్చపండు, తర్బూజా, పైనాపిల్, జామ, దానిమ్మ తదితర పండ్లతో పాటు ఎండు ఖర్జూరా సైతం అమ్మకానికి సిద్ధంగా ఉంచారు.

సీసీ కెమెరాలతో నేరాలు అదుపు

- ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం
- ఎస్ఐ సంతోష్‌కుమార్



సీసీ కెమెరాల ఏర్పాటునకు విరాళం అందజేస్తున్న గ్రామస్తులు

పరిగి: సీసీ కెమెరాలతో నేరాలు అదుపు చేయొచ్చని ఎస్ఐ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమన్నారు. మండల పరిధిలోని రాపోల్ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులందరు కలిసి రూ.78వేలు సేకరించి ఎస్ఐ సంతోష్‌కుమార్‌కు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. దీంతో గ్రామస్తులందరు ముందుకు వచ్చి సీసీ మెకెరాల ఏర్పాటునకు తమవంతు సాయంగా వి అందజేశారన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాల నివారణ, అనుకోకుండా ఏదైన సంఘటన జరిగితే సీసీ కెమెరాలు సాక్ష్యంగా ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నాగవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగంగా పూర్తిచేయాలి

మున్సిపల్ కమిషనర్ యోగేశ్



తీగల వాగు వద్ద రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో రోడ్డు నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ యోగేశ్ అన్నారు. మంగళవారం ఆయన శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్, చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఆర్అండ్‌బీ డీఈఈ రమేశ్, ఏఈ చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను పరిశీలించి మట్లాడారు. చేవెళ్ల-శంకర్‌పల్లి ప్రధాన రహదారి విస్తరణ పనులు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, అదే విధంగా ఫత్తేపూర్ రైల్వే వంతెన ప్రారంభ, ముగింపుల వద్ద రోడ్డు వేయాలని, బ్రిడ్జి క్రింద వర్షపు నిల్వకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. నిర్మాణ పనులు అయ్యే సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పోలీసులు కృషి చేస్తారని తెలిపారు. ఈ పనులన్నింటినీ వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించం

తహసీల్దార్ కృష్ణయ్య



ప్రభుత్వ భూమిలో వేసిన ఫ్రీకాస్టింగ్‌లను జేసీబీతో తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

చేవెళ్ల: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని మండల తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. మండలంలోని కమ్మెట గ్రామంలో సర్వే నెం.270లో ఉన్న ప్రభుత్వ భూమి 2 ఎకరాలలో వేసిన ఫ్రీకాస్టింగ్ పలకలను మంగళవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమించటం చట్టరీత్యా నేరమన్నారు. కమ్మెట గ్రామంలో ఉన్న 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి ఫ్రీకాస్టింగ్ వేసినట్లు సమాచారం అందడంతో అక్కడికి పరిశీలించామన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమిలోకి వచ్చిన ఫ్రీకాస్ట్ గోడలను జేసీబీతో కూల్చివేసినట్లు తెలిపారు. అక్రమంగా ప్రభుత్వ భూమిలోకి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే చేసి గుర్తించి హద్దులు వేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిని కాపాడుకునే బాధ్యత అధికారులదేనని, ఎవరైనా ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి

షాబాద్: క్రీడలు మానసికోల్లాంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడుతాయని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని పీఆర్ఆర్ స్టేడియంలో నియోజకవర్గస్థాయి క్రికెట్ క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత 35 సంవత్సరాలుగా షాబాద్‌లో ప్రతి ఏడాది పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నామన్నారు. గ్రామాల మధ్య స్నేహ సంబంధాలను పెంచేందుకు ఇలాంటి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడా నిర్వాహకులు మహేశ్ యాదవ్, రమేశ్‌యాదవ్, ధనుంజయ్, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గూడూరు నర్సింగ్‌రావు, కార్యదర్శి చల్లా శ్రీరాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు పొన్న నర్సింహారెడ్డి, నక్క శ్రీనివాస్‌గౌడ్, తదితరులు ఉన్నారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి

నేడు గాడిబాయి శివాలయంలో పూజలు

కొడంగల్: పట్టణంలోని గాడిబాయి శివాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు కిట్టు స్వామి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి రుద్రాభిషేకం, పాలు, పండ్లు, నారికేళ ఫలం సమర్పణ ఉంటుందని తెలిపారు. రాత్రి 9 గంటలకు అఖండ భజన, జాగరణ, గురువారం ఉదయం 8 గంటలకు స్వామివారికి నైవేద్య సమర్పణ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు

ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. నర్సరీలను నిత్యం పరిశీలించి, మొక్కలకు నీరు పోయించాలని, గ్రామాల్లో పన్ను వసూలు, ఉపాధి హామీ పనులు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

ఆలయానికి విరాళం

శంకర్‌పల్లి: పట్టణంలోని 14వ వార్డులో గల వీరాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి మండలంలోని చెందిప్ప గ్రామానికి చెందిన ఇంద్రసేనారెడ్డి రూ.30వేల విరాళం ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ఈ మొత్తాన్ని నగదు రూపంలో ఆలయ కమిటీ చైర్మన్ పాండురంగారెడ్డికి అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుండా శేఖర్, నాయకులు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయ చైర్మన్‌గా శంకర్‌రావు

తాండూరు: పట్టణంలో రైల్వే స్టేషన్ ఆవరణలోని హనుమాన్ దేవాలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని నియమిస్తూ దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హనుమాన్ దేవాలయ కమిటీ చైర్మన్‌గా ఎం శంకర్‌రావు, సభ్యులుగా ఎం వెంకటేషం, ఎస్ నారాయణ, శ్రీధర్, నరహరి, ఇందులను నియమించారు.

మరో రెండు దేవాలయ కమిటీలకు నోటిఫికేషన్ జారీ..

తాండూరు పట్టణంలోని పాట్లి మహరాజ్ దేవాలయ నూతన కార్యవర్గం ఏర్పాటుకు దేవాదాయ శాఖ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ ఉత్తర్వులు జారీ అయిన 20 రోజుల వ్యవధిలో దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. అయితే ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పలువురు నేతల పేర్లను పరిగణలోకి తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు తాండూరు పట్టణంలోని నగరేశ్వర దేవాలయ కమిటీకి మొదటి నుంచి ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులే పోటీలో ఉంటున్నారు. అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న నాయకులకు ఈ పదవి వరించే అవకాశం ఉందని స్థానికంగా చర్చ జరుగుతోంది.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

మాజీ సర్పంచ్ జయశ్రీ



విద్యార్థులతో టోల్‌ప్లాజా సిబ్బంది, నాయకులు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని మాజీ సర్పంచ్ జయశ్రీచంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విశ్యాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఐ సడక్ జడ్చర్ల ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ రాయికల్ టోల్‌ప్లాజా సహకారంతో స్వెటర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ సర్పంచ్ హాజరై విద్యార్థులకు స్వెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదిగినప్పుడే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు స్వెటర్లు అందించిన టోల్‌ప్లాజా సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా సిబ్బంది జగదీశ్, శ్రీనివాస్, శ్రీకాంత్, సందీప్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



కుల్కచర్ల: పటేల్ చెరువు తండాలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నేతలు



తాండూరు రూరల్: జినుగుర్తిలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు



మోమిన్‌పేట: మొరంగపల్లి గ్రామంలో పనులు ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కృషి చేస్తున్నారని తాండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజ్మత్ అలీ, రామలింగేశ్వర ఆలయ మాజీ చైర్మన్ ప్రవీణ్‌గౌడ్ పేర్కొన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.8 లక్షలతో గ్రామంలో మసీదు నుంచి ఊరడమ్మ దేవాలయం వరకు సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తామన్నారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఆయా గ్రామాలకు రూ.2.35కోట్ల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల అయ్యాయని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.10లక్షలతో సబ్‌ప్లాన్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో మండలానికి రూ.2.35కోట్లు ఎస్సీ సబ్‌ప్లాన్, రూ.4.04కోట్లు ఎన్ఆర్ఇజీఎస్ నిధులు విడుదల చేయించారన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను ఎస్సీ కాలనీల్లో వినియోగించాలన్నారు. సీసీ రోడ్డు, మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాలన్నారు. ఎన్ఆర్ఇజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య, మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, మండల పార్టీ యువ అధ్యక్షుడు సుభాష్, మాణయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషిచేస్తుందని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం పటేల్ చెరువు తండాలో ఉపాధిహామీ నిధులు రూ.5లక్షలతో సీసీరోడ్డు నిర్మాణా పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వసతులను కల్పించడంతో పాటు రవాణాసౌకర్యాలను మెరుగుపరచనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివరాం నాయక్, చంద్రభూపాల్ రావు, రవి, లావుడ్య శ్రీను, విఠల్ నాయక్, వేముల రాములు, షర్ఫోద్దీన్, అనంతయ్య, అంజి, మొగులయ్య, సేవ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.